ప్రజాశక్తి
గురువారం 26 డిసెంబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వర్ష భయం

తడి, పాడి వరి పనలనే కుప్పలుగా వేస్తున్న రైతులు

- ఆరకముందే కుప్పలు
- ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతుల ఆందోళన
- 2900 ఎకరాల్లో తడిసిన వరి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో చిన్నపాటి వర్షాలు, స్వల్ప గాలులు, వాతావరణ మబ్బులతో వరి రైతులు కోసిన పంటను రక్షించుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం 2900 ఎకరాల్లో పంట తడిసింది. 33 శాతం లోపే పంట తడవడంతో పంట నష్టం ఉండదని అధికారులు చెబుతున్నారు. అయితే పంట తడవకపోయినా కోసిన వెంటనే కుప్పలు వేయడంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు ఉపయోగించాల్సిన గడ్డి పాడవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఫలం ఇంటికి వస్తున్న సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట పోతుందని ఆందోళన చెందుతున్నారు. కోసిన వరిపంట ఆరకముందే కుప్పలు వేస్తున్నారు. కొంతమంది రైతులు టార్పాన్లతో వరి కుప్పలు కప్పుకున్నారు. ప్రతికూల వాతావరణం రైతును గుక్కతిప్పుకోనియకుండా చేస్తోంది. జిల్లాలో 1.41 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. దీంట్లో 85,700 ఎకరాల వరకు వరి పంట కోశారు. రోలుగుంట, రావికమతం మండలాల్లో 90 శాతానికిపైగా వరి కోతలయ్యాయి. 4,700 మంది రైతులు 4,500 ఎకరాల్లో కోసిన వరిపంట వర్షాలకు తడిసిపోకుండా వేసిన కుప్పలను టార్పాన్లతో కప్పారు.

పంట కోసిన 85,700 ఎకరాల్లో 76వేల ఎకరాల్లో రైతులు కుప్పలు వేసుకున్నారు. 5వేల ఎకరాలకు సంబంధించిన వరి నూర్పులు చేశారు. నూర్పిడిలో వచ్చిన 9300 మెట్రిక్ టన్నుల దిగుబడిలో సొంత అవసరాలకు 7,150 మెట్రిక్ టన్నులు వినియోగించుకోనున్నారు. 300 మెట్రిక్ టన్నులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1149 మెట్రిక్ టన్నులు అమ్మారు. దాదాపు మరో 680 టన్నులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉన్నాయి.

వార్తలు 7లో..

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ మత బోధకులు, భక్తులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో క్రిస్మస్ వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చర్చిలకు చేరుకున్నారు. విశాఖలోని పెద్ద పెద్ద చర్చిలలో వరుసగా రెండు, మూడు ప్రార్థనలు నిర్వహించారు. కొన్ని చర్చిలలో అర్థరాత్రి నుంచి ప్రార్థనలు చేపట్టారు. రోజ్ హిల్స్, లండన్ మెషనరీ చర్చిలలో ఆంగ్లంలోనూ, తెలుగులోనూ ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తూ గీతాలు ఆలపించారు. అన్నిచోట్లా పేదలకు దానం కార్యక్రమాలు నిర్వహించారు.

కుసులవాడలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

వార్త మెయిన్ 3లో..

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

వార్త 6లో..

వడివడిగా ఇళ్ల నిర్మాణాలు

వార్త 3లో..

కూలి రేట్లు పెంపుపై ప్రభుత్వం స్పందించాలి

వార్త 5లో..

హనీ ట్రాప్ కేసులో...

మరో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇటీవల కాలంలో విశాఖ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన జాయ్ జమీమా హనీ ట్రాప్ కేసులో మరొక ముగ్గురిని అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితురాలు జాయ్ జమీమా, ఆమెకు సహకరించిన ఫారెస్ట్ అధికారి వేణు భాస్కర్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా విచారణ క్రమంలో బుధవారం మరో ముగ్గురు నిందితులు ఫాతిమా ఉస్మాన్ చౌదరి అలియాస్ జోయా, ఆమె భర్త తన్వీర్, అవినాష్ బెంజిమన్‌లను హైదరాబాద్‌లో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురిని విశాఖ తీసుకొచ్చి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా వారికి 15 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. ఈ ముగ్గురు నిందితులు బాధితులపై మత్తు పదార్థాలు ఉపయోగించడంతో స్ప్రేలు సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషించారని, అందుకుగాను భారీ మొత్తంలో నగదు బదిలీ జరిగినట్లు ఆర్థిక లావాదేవీల ద్వారా గుర్తించినట్లు వివరించారు.

సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారికి మత్తుమందు ఇతర స్ప్రేల సహాయంతో, వారితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను తీసి అనంతరం వారి నుంచి డబ్బులు వసూలు చేసిన కేసు తీవ్ర సంచలనంగా మారిందని, ఇంకా ఎవరైనా బాధితులుంటే సంబంధిత స్టేషన్లలో హౌస్ ఆఫీసర్లను కలిసి ఫిర్యాదు చేస్తే వారికి తగిన న్యాయం చేస్తామని నగర పోలీసులు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు

-ఇందిరా నగర్‌లో ఘటన

ప్రజాశక్తి - ఆరిలోవ

జివిఎంసి 10వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కథనం ప్రకారం... ఇందిరానగర్ రామాలయం వెనుక వీధిలో వీసం అప్పారావు కుటుంబంతో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గ్యాస్ బండ లీకై పేలి పెద్ద శబ్దం వచ్చింది. ఇంట్లో ఉన్న తిరుమలరెడ్డి సత్యవతి (26), నందిని (27) పి.వెంకట్(28)కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు సంజు (13), రాజు (10)కు పాక్షికంగా గాయాలయ్యాయి. ఒక బండ తర్వాత మరొక బండ పేలినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. క్షతగాత్రులను పోలీసులు స్థానిక విమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సిపిఎం జిల్లా మహాసభ జయప్రదానికి...

ఊరూరా విస్తృత ప్రచారం

వార్తలు 4లో....

ప్రజల పత్రిక ప్రజాశక్తి

ఆర్‌టిసి విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర

ప్రజాశక్తి- హుకుంపేట, దుంబ్రిగుడ: ప్రజల గొంతుక, ప్రజల కోసం పనిచేసే పత్రిక ప్రజాశక్తి అన్ని ఏపీ ఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, అరకు ఇన్చార్జి సివేరి దొన్నుదొర కొనియాడారు. టీడీపీ అరకు ఇంచార్జి కార్యాలయంలో ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ, కోర్టు క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, ప్రజా సమస్యల పై పట్టున్న పత్రిక ప్రజాశక్తి అని ఆయన అన్నారు. తన చేతుల మీదుగా క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి కూడా ప్రజాశక్తిని ఆదరించి ప్రోత్సహించే వాడేనని ఆయన గుర్తు చేశారు. అన్ని క్యాలండర్ల కన్నా అందంగా, సుందరంగా ప్రజాశక్తి క్యాలెండర్ ఉందన్నారు. సామాన్య ప్రజలు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు అందరూ ప్రజాశక్తి క్యాలెండర్ ఆదరిస్తారన్నారు. వాస్తవ కథనాలు ప్రచురించే నైజం ప్రజాశక్తి కే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజాశక్తి దిన పత్రిక మంచి కథనాలతో ముందుకు సాగి తనదైన శైలిలో గుర్తింపు పొందిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెలికి తీసి పరిష్కరించే విధంగా మరింతగా పాటు పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకు మండల అధ్యక్షుడు బాబురావు, జనసేన అరకు ఇంచార్జ్ ఎస్ చిరంజీవి, విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముల్లంగి శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి టిడిపి పార్టీ ప్రెసిడెంట్ బుజ్జి బాబు, పార్టీ కార్యదర్శి వి.వెంకటరావు, మాజీ సర్పంచ్ దూరు వీరన్న దొర, యూనిట్ ఇన్చార్జులు లక్ష్మణరావు, హరిబాబులు, ప్రజాశక్తి విలేకర్లు కొర్రా ఆనంద్, స్వామి, ప్రజాశక్తి అల్లూరి జిల్లా ఇన్చార్జి పి దేవుడు బాబు పాల్గొన్నారు,

రెవెన్యూ సదస్సులపై ముందస్తు సమాచారం ఏదీ?

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు: మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నపటికి ఆదివాసి గిరిజనులకు పారదర్శకంగా నిర్వహించడంలో వైఫల్యం చెందారని మండల వైస్ ఎంపీపీ 1 పాటుబోయి సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, రెవిన్యూ సదస్సుపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చి ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉనప్పటికీ వాటికి విరుద్ధంగా నిర్వహించడం సరికాదన్నారు. రెవిన్యూ సదస్సులకు తహసిల్దార్ హాజరు కాకుండా వివిధ కారణాలు చెబుతుండటంలో ఆంతర్యం ఏమిటో తెలపాలన్నారు. రెవిన్యూ సదస్సు నిర్వహణపై గ్రామాల్లో దండోరా వేసి ముందస్తు సమాచారమిచ్చి అవగాహన పరిచి ప్రజలు హాజరయ్యే విధంగా చేయడంలో వైఫల్యం చెందుతున్నారని మండిపడ్డారు.ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కచ్చితంగా రెవిన్యూ సదస్సు కొనసాగించాలని డిమాండ్ చేశారు. తూతు మాత్రం నిర్వహిస్తూ సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యహరీస్తున్నారన్నారు.. పూర్తిస్థాయిలో నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రొబ్బ గణపతి, హరిబాబు, రామ్మూర్తి, ఆదిబాబు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-కూనవరం : పోలవరం నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూ ప్యాకేజీ, పునరావాసం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ద్వంద్వ విధానం ఇకనైనా విడనాడాలని, ముందు నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లో గోదావరి ముంపు సమస్యతో పాటు రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చేయాలో కాకుండా ప్రాజెక్టు ఎంత త్వరగా కట్టాలో ప్రభుత్వం ఆలోచిస్తుందని ఎద్దేవా చేశారు. నిర్వసితులకు న్యాయం చేయకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, నాయకులు పాయం సీతారామయ్య, సర్పంచ్ మడకం నాగమణి, రామారావు, తమ్మయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, మడం బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి మేళా దోహదం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎస్‌హెచ్‌జి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌హెచ్‌జి మేళాను నిర్వహిస్తున్నాయని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. విశాఖలోని గల ఎఎస్.రాజా కాలేజీ మైదానంలో 2024 ఎస్‌హెచ్‌జి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ, విశాఖపట్నంలో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారుచేసిన వస్త్ర, ఆహార ఉత్పత్తులు 100 స్టాళ్ల ఏర్పాటుతో ఐదు రోజులు పాటు సంజ ఉత్సవ్ - అప్నో కా ఉత్సవ్-2024ను జివిఎంసి, మెప్మా ఆధ్వర్యాన నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ మేళాను ప్రజలు సందర్శించి మహిళల ఆర్థిక బలోపేతానికి సహకరించాలని కోరారు. మహిళల అభ్యున్నతికి తనకు కేటాయించిన రూ.10 కోట్ల ఎంపీ నిధులను వినియోగిస్తానన్నారు.

జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఎస్‌హెచ్‌జి మహిళల అభ్యున్నతికి ఈ మేళాను

ఎస్‌హెచ్‌జి మేళాను ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ మేళాను ప్రజలందరూ వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, యుసిడి పథక సంచాలకులు పిఎం.సత్యవేణి, జివిఎంసి కార్పొరేటర్లు గొలగాని మంగవేణి, గేదెల లావణ్య, బిపిన్ కుమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

బుట్ట బొమ్మ శారీ స్టోర్ ప్రారంభం

బుట్ట బొమ్మ శారీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ : వస్త్ర వ్యాపార రంగంలో 93ఏళ్ల అనుభవం ఉన్న 'బొమ్మన' సంస్థ ఆధ్వర్యాన మద్దిలపాలెంలో 'బుట్ట బొమ్మ' పేరిట ఏర్పాటుచేసిన నాల్గవ స్టోర్‌ను బుధవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ మేరకు సంస్థ అధినేత బొమ్మన సత్యరాజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. నమ్మికకు, నాణ్యతకు ప్రాధాన్యతను ఇస్తూ ఆధునిక డిజైన్లతో కూడిన అన్ని చీరలు బుట్ట బొమ్మ శారీ స్టోర్‌లో లభ్యమవుతాయన్నారు. 93 ఏళ్లుగా బొమ్మన కుటుంబాన్ని ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని, వారి అభిరుచికి అనుగుణంగా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చేరువ చేసేందుకే 'బుట్ట బొమ్మ'ను ప్రారంభించామని తెలిపారు. 'బుట్ట బొమ్మ' అధినేత బొమ్మన మణిరాజ్ కుమార్ మాట్లాడుతూ, సంప్రదాయం ఉట్టిపడేలా గద్వాల్, కంచి, ధర్మవరం వంటి చీరలు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేలా వస్త్రాలను ఇక్కడ విక్రయించనున్నట్లు తెలిపారు. బొమ్మన సిల్క్స్ అధినేత బొమ్మన యువరాజ్ కుమార్ మాట్లాడుతూ, వస్త్ర వ్యాపారాన్ని తమ కుటుంబం తరాలుగా కొనసాగిస్తుందని, వారి బాటలో తాము కూడా విలువలతో షోరూమ్‌లు నడుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొమ్మన సునీత, బొమ్మన సంజన, బొమ్మన చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ వృద్ధిపై శ్రీరామ్ ఫైనాన్స్ ప్రణాళిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తన ఎంఎస్ఎంఇ లోన్ పోర్ట్‌ఫోలియోలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని సంస్థ ప్రతినిధి కె.శ్రీనివాస్ వెల్లడించారు. ఎంవిపి కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 2024 నాటికి, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీరామ్ ఫైనాన్స్‌కు చెందిన అన్ని ఎంఎస్ఎంఇల నిర్వహణ ఆస్తుల (ఎయుఎం) విలువ రూ.4,907.89 కోట్లు ఉండగా, తెలంగాణాలో ఆ విలువ రూ.4,666.20 కోట్లుగా ఉందని తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్‌కు చెందిన ఎంఎస్ఎంఇల మొత్తం ఎయుఎం విలువ 2024 సెప్టెంబర్ 30 నాటికి రూ.32,299.68 కోట్లుగా ఉందని వెల్లడించారు. సంస్థ పూర్తిస్థాయి వ్యాపారానికి సంబంధించిన మొత్తం ఎయుఎం రూ.2,43,042.55 కోట్లు ఉండగా, అందులో ఈ వాటా 13.29 శాతం వాటాగా ఉందని వివరించారు. భారతదేశం వ్యాప్తంగా 3,149 బ్రాంచీలతో శ్రీరామ్ ఫైనాన్స్ సేవలు అందిస్తోందని తెలిపారు.

వర్షాలకు రహదారి బురదమయం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి కొయ్యూరు వచ్చే రహదారి వర్షాలు కారణంగా బురదమయమైంది. రోడ్డు ఇరువైపులా వేసిన మట్టి వర్షానికి రోడ్లపైకి వచ్చి చేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. బురద వల్ల రహదారి ప్రమాదభరితంగా మారింది. మట్టి బురద ద్విచక్ర వాహనాల గేర్లకు, చక్రాలకు అడ్డంపడి వాహనాలు స్కిడ్ అయ్యాయి. బస్సులు సైతం గంట సేపు ఆగక తప్పలేదు. విధిలేని పరిస్థితుల్లో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు దిగి కొంత దూరం కాలినడకన ముందుకు సాగారు. ప్రమాదకర మలుపు వద్ద బురదమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు సైతం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

27న 'కర్ణ పిశాచి' విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్‌బికె డ్రీమ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించిన సస్పెన్స్, థ్రిల్లర్, హర్రర్ లవ్ స్టోరీ 'కర్ణ పిశాచి' చిత్రం ఈ నెల 27న రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతుందని చిత్ర దర్శకుడు విజయ్ మల్లాది తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల విశాఖ, అరకు, చింతపల్లి, విజయనగరం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మూవీకి సంబంధించి మొదటి పోస్టర్‌ను ప్రముఖ సినీ గేయ రచయిత, కీర్తిశేషులు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఆవిష్కరించడం జీవితంలో మర్చిపోలేనన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా చిత్ర పోస్టర్‌ను హీరో సంపూర్ణేష్ బాబు విడుదల చేశారు. హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, చిత్రం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నిర్మాత భరత్‌కుమార్ సిగిరెడ్డి మాట్లాడుతూ, చిత్రంలో నటీనటులు నిఖిల్, ప్రణవి, రమ్య, భానుప్రకాష్, ఈశ్వరరావు, ఆర్‌కె.నాయుడు, ముత్యాలరావు, తారాబాయ్ తదితరులు కీలక పాత్రలో నటించారని చెప్పారు. మల్లాది విజయ్ దర్శకత్వం వహించారని తెలిపారు.



కర్ణ పిశాచి పోస్టర్‌ను విడుదలచేస్తున్న చిత్రర యూనిట్ సభ్యులు

ఎంపిహెచ్ఇఒ జోజిబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ జోజిబాబు మృతికి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి, ఆస్పత్రి సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

వడివడిగా ఇళ్ల నిర్మాణాలు

- మంజూరైనవి 2085 : పూర్తయినవి 972
- సంక్రాంతికి ముందే గృహ ప్రవేశాలకు సన్నాహాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం :భీమిలి మండలం తో పాటు జివిఎంసి పరిధిలో గృహనిర్మాణాలు వడివడిగా సాగుతున్నాయి. సంక్రాంతికి ముందే మెజార్టీ గృహప్రవేశాలు జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఒకటో జోన్ పరిధిలో 2085 ఇళ్లు మంజూరు కాగా, 972 నిర్మాణాలు పూర్తయ్యాయి. పునాది కంటే దిగువ స్థాయిలో 373 ఇళ్ల, పునాది స్థాయిలో 506 ఇళ్లు, లెంటెల్ స్థాయిలో 53 ఇళ్లు, రూఫ్ లెవెల్‌లో 143 ఇళ్లు, శ్లాబ్ స్థాయిలో 38 ఇళ్లు ఉన్నాయి. మండలంలోని బోడమెట్టపాలెంలో 52 ఇళ్లు మంజూరు కాగా 18 పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. దాకమర్రిలో 190 ఇళ్లకు గాను 89 పూర్తయ్యాయి. మజ్జిపేటలో 73 ఇళ్లకు 16 పూర్తయ్యాయి. నారాయణ రాజు పేటలో 8 ఇళ్లకు 3 ఇళు ,, సింగనబందలో 65 ఇళ్లకు 38, మజ్జివలసలో 25 ఇళ్లకు 22, తాటితూరులో 58 ఇళ్లకు 14, టి నగరపాలెంలో 14 ఇళ్లకు 11, మూలకుద్దులో 110 ఇళ్లకు గాను 53, రేఖవానిపాలె లో 81 ఇళ్లకుగాను 25, చిప్పాడలో 254 ఇళ్లకు గాను 88 ఇళ్ళ, పెద నాగమయ్యపాలెంలో 20 ఇళ్లకు గాను 11, అమనాంలో 66 ఇళ్లకు గాను 41, అన్నవరంలో 60 ఇళ్లకు గాను 24 ఇళ్లు, తాళ్ళ వలసలో 10 ఇళ్లకు గాను 8 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జివిఎంసి నాల్గో వార్డు జెవి అగ్రహారంలో 151 ఇళ్లకు గాను 51, నిడిగట్టులో 128 ఇళ్లకు గాను 60 ఇళ్లు, కాపులుప్పాడలో 169 ఇళ్లకు 95 ఇళ్లు, కె నగరపాలెంలో 230 ఇళ్లకు 122 ఇళ్లు, చేపలుప్పాడలో 276 ఇళ్లకు గాను 145 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

సంక్రాంతికి ముందు గహ ప్రవేశాలు..

వచ్చేనెలలో సక్రాంతి కి ముందు ఇప్పటికే పూర్తయిన ఇళ్లను 'మన ఇళ్లు, మన గౌరవం' పేరుతో ప్రారంభించి లబ్దిదారులచే నూతన గృహ ప్రవేశాలు చేయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇళ్లు

మార్చి 31 నాటికి పూర్తి చేయాలి

పునాది స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు వచ్చే మార్చి 31 నాటికి పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించింది. నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు ఇప్పటి నుంచే లబ్దిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అడ్వాన్స్ అమౌంట్‌లు రూ 5 వేలు నుంచి 20 వేల వరకు తీసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని ఇళ్లు 228 ఉన్నాయి. నిర్ణీత గడువులోగా సంబంధిత ఇళ్ళ నిర్మాణం పూర్తి కాకుంటే వాటిని రద్దు చేయాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది.

గత వైసిపి ప్రభుత్వం 2020లో లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా, 2021లో ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ 1.80 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇందులోనే 90 బస్తాల సిమెంట్, 20 టన్నుల ఇసుక, 475 కిలోల ఇనుము ఇచ్చింది.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రాంగణంలో బుధవారం 40 మంది నిరుపేద వృద్ధులకు 5 కిలోల బియ్యం, అర కిలో చొప్పున కందిపప్పు, చింతపండు, వంట నూనె, పంచదార పంపిణీ చేశారు. పీఠం 23వ వార్షికోత్సవం సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి డాక్టర్ వెంకటేశ్వర యోగి, సాహితీవేత్త పరవస్తు ఫణి శయనసూరి, మనోజ్ కుమార్ జైన్, పీఠంకన్వీనర్ డాక్టర్ పింగళి ఆనందకుమార్, డాక్టర్ ఎ రాధాకృష్ణ, డివి నారాయణరావు పాల్గొన్నారు

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -కూనవరం :మండలంలోని కోతులగుట్ట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కాలేజ్ హాస్టల్లో 270 మంది విద్యార్థినులకు ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తమ విద్యాలయం పిల్లలకు రూ.54వేలు విలువగల దుప్పట్లు అందించినందుకు ప్రిన్సిపాల్ స్వరాజ్యం ఎఎస్‌డిఎస్ డైరెక్టర్ గాంధీబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం చలికాలంలో గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలతో చలికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీతో ఉపశమనం లభించింది. కార్యక్రమంలో వి.హరిబాబు నాట్వాన్, సంఘం ఉపాధ్యక్షురాలు సోయం నాగమణి, క్లస్టర్ కోఆర్డినేటర్స్ నీరుపాటి రవి, పూజిత, ఉపాధ్యాయులు దుర్గ, విజయ, రాణి, ఎఎన్ఎం పాల్గొన్నారు.

ప్రజాదర్బారులో సమస్యల పరిష్కారం

- వచ్చేనెల మొదటి వారం నుంచి అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటన
- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక :వచ్చేనెల మొదటి వారం నుంచి ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా అధికారులతో వార్డులలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కరిస్తామని కృషి చేస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. గాజువాక నియోజకవర్గంలో 50వేలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో భాగస్వాములైన బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జిలు, వార్డు క్లస్టర్లు, కార్యవర్గానికి, అందరికీ అభినందనలు తెలిపారు. టిడిపి సభ్యత్వాల నమోదును 80వేలకు పెంచేలా కృషి చేయాలన్నారు. తన ఉన్నతికి అన్ని విధాలుగా చేదోడువాదోడుగా ఉంటున్న నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. వారి ప్రయోజనాలను కాపాడడం ద్వారా రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలో పలు కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. ఉక్కు నిర్వాసితుల ప్రయోజనాలు కాపాడటానికి ఎవ్వరితోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, 75వ వార్డు ఇంచార్జ్ పులి రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎండీ. రఫీ, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ కృష్ణ,, 70వ వార్డు ఇన్‌ఛార్జి చట్టి గోపి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు

మన్యంలో మిశ్రమ వాతావరణం

దెబ్బకోట గ్రామ సమీపంలో అధికంగా కురుస్తున్న మంచు

ప్రజాశక్తి-సీలేరు :జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో బుధవారం మిశ్రమ వాతావరణం నెలకొంది. ఉదయం 6 గంటలకు చిన్నపాటి వర్షం ముసురును తలపించేలా వర్షం కురిసింది. ఉదయం 9 గంటలకు కాస్త ఎండ కాసింది. అనంతరం మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. చల్లటి చలిగాలులు వీస్తూ చలి తీవ్రత అధికమైంది. దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో అధిక మొత్తంలో మంచు కురిసింది. మంచు, చలి తీవ్రత తాళలేక ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు. అతి శీతల వాతావరణం, చల్లటి గాలుల వల్ల చలి తీవ్రతను తట్టుకోవడానికి గిరిజనులు చలిమంటలు వేసుకుంటూ ఉపశమనం పొందారు. ఈ మిశ్రమ వాతావరణం వల్ల దీర్ఘకాలిక రోగులు అష్ట కష్టాలకు గురయ్యారు. చలితోనే ప్రజలు చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- సీతమ్మధార: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అక్కయ్యపాలెంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలివి. సంఘమిత్ర సోషల్ సర్వీస్‌లో పనిచేస్తున్న వెంకటేష్ (27) రెండేళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. కొంతకాలంగా గంజాయికి బానిసైన వెంకటేష్, తీవ్రమనస్తాపంతో సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెం షాదీ కల్యాణ మండపం ప్రాంతానికి చెందిన 17ఏళ్ల బాలిక అదృశ్యంపై బుధవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాలివి. షాదీ కల్యాణ మండపం సమీపంలో కేకులు విక్రయించే దుకాణంలో పనిచేస్తున్న బాలిక, పనిలో భాగంగా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే మరుసటి రోజు ఉదయానికి కూడా తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు, మిత్రులు ఇళ్లలో వెదికిన కుటుంబసభ్యులకు బాలిక ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి

పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు : గంజాయి అక్రమ రవాణాపై సీలేరు ఎస్సై రవీంద్ర ఆధ్వర్యాన పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జీకే వీధి మండలం సీలేరు ప్రధాన కుడళ్లలో సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులను మోహరించి అణువణువున తనిఖీలు చేశారు. ఆంధ్రా, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించి, వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. గంజాయి అక్రమ రవాణా, సాగు నివారణపై పోలీసులు మారుమూల గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులు నుంచి మైదాన ప్రాంతానికి స్మగ్లర్లు గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఇంటెలిజెన్సీ వర్గాలు పదేపదే హెచ్చరికలు చేయడంతో ఆ దిశగా పోలీసులు దృష్టి సారించి తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. స్థానిక ఏపీ జెన్కో చెక్‌పోస్టు ఆఫీస్ ఐటిఐ జంక్షన్ కుడళ్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసు తనిఖీలు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై రవీంద్ర సూచించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు . నేరెళ్ళవలస కాలనీ, బోయివీధి, గొల్లల పాలెం, కృష్ణా కాలనీ, ఎగువపేట, గొల్లవీధి, తోటవీధి తదితర ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావును నగరంలోని ఎంవిపి కాలనీలో అతని నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మరికొన్ని ప్రాంతాల్లో పాత విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చి, తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని కోరారు.



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేత నూకరాజు

వివక్షత లేని సమాజానికి
కెవిపిఎస్ పోరాటం

కేలండర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి- గాజువాక :వివక్షత లేని సమాజం కోసం కెవిపిఎస్ అనేక పోరాటాలు చేసిందని, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు అన్నారు.బుధవారం సాయంత్రం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లోకెవిపిఎస్ ముద్రించిన 2025 కేలండర్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దళితులపై దాడులు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు బీవీ రాఘవులు ఆధ్వర్యంలో కెవిపిఎస్ ప్రత్యక్ష పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. వివక్షతపై ప్రజల్లో చైతన్యానికి సైకిల్ యాత్ర, ఇతర అవగాహన కార్యక్రమాలను కెవిపిఎస్ నిర్వహించిందన్నారు. నేటికీ దళితులపై దాడులు విచారకరమన్నారు.

ఇటీవల ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాను దేవాలయాలకు రాకుండా బయట ఉంచిన విధానం ఇందుకు నిదర్శనమన్నారు. ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో నేటికీ దళితులపై హింస, హత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పైనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా అనుచిత వ్యాఖ్యలను తప్పుపట్టారు. బిజెపి ప్రభుత్వం అనేక రాజ్యాంగం సవరణలు చేస్తోందందని, అందులో భాగంగా ఎన్నికల సంఘం, ఎన్నికలల్లో చేపడుతున్న సవరణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఎలక్షన్ కమిషన్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేకుండా తొలగించారన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ రక్షిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎ.తవిటయ్య, దయాసాగర్, రామారావు, మత్స్యరాజు, విష్ణు ప్రసాద్, దయాసాగర్, కెవిపిఎస్ నాయకులు వైటిదాస్, ఇమ్మాన్యుయేల్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం, జిమ్ ప్రారంభం

జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 40వ వార్డు ఎకెసి కాలనీలో రూ.18 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని, అలాగే రూ.ఐదు లక్షల జివిఎంసి నిధులతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను బుధవారం స్థానిక వార్డు కార్పొరేటర్ డాక్టర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు పరిధిలో ఆసుపత్రి, కల్యాణమండపం, బడి గుడి, రోడ్లు, డ్రైనేజీలో ఇలా అనేక అభివృద్ధి పనులను చేపట్టాలమని, ఇపుడు సామాజిక భవనం, జిమ్‌ను ప్రారంభించామన్నారు. ఈ ప్రాంత ఏళ్లనాటి కల నేటికి సాకారమైందని,దీన్ని యువతకు అంకితమిస్తున్నట్లు వెల్లడించారు. పెద్దల సహకారాలతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో గంటా వర్మ, వరపల మహేష్, గణేష్ మిశ్రా, గుండపు ఆశోక్, దేబర్కి కృష్ణ, జెర్రిపోతుల శివ, పట్నాల వెంకటేష్, బంటు కోటేశ్వరరావు, అన్నం వాసు, గుండపు సందీప్, పప్పల శివ, శేఖర్, ప్రవీణ్, సాంబ, భాస్కర్ పాల్గొన్నారు

సిపిఎం జిల్లా మహాసభ జయప్రదానికి ఊరూరా విస్తృత ప్రచారం

• పలుచోట్ల బైక్ ర్యాలీలు • పార్టీ జెండావిష్కరణ • వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలు

ఈనెల 28,29 తేదీల్లో పెందుర్తి, సుజాతనగర్‌లో నిర్వహించే సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల జెండావిష్కరణలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ, బైక్ ర్యాలీలతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా 28న మహాప్రదర్శన, బహిరంగసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

ములగాడ: సిపిఎం విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం 63వ వార్డు కాకరలోవలో పార్టీ జెండాను జోన్ నాయకులు కె.పెంటారావు ఆవిష్కరించారు. అనంతరం బైక్ ర్యాలీని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై వారి పక్షాన సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు, అధిక ధరల నియంత్రణ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగ లేబరు కోడ్స్ రద్దు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌కరణ నిర్ణయం ఉపసంహరణ, యువత ఉద్యోగం,ఉపాధి కల్పన తదితర అంశాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ, ప్రజా ఉద్యమాలపై మహాసభల్లో నిర్ణయాలు, తీర్మానాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా క్రాంతినగర్, త్రినాథపురం, దుర్గా నగర్, జనతాకాలనీ మీదుగా నెహ్రూనగర్ లేబర్ జంక్షన్ చేరుకొని శ్రీహరిపురం మీదుగా మల్కాపురంతో బైక్ ర్యాలీ ముగిసింది. సిపిఎం మహాసభలలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బైక్‌ర్యాలీలో జోన్ కార్యదర్శి పూడి పైడిరాజు, కె. పెంటా రావు, ఎ.సత్యారావు, పివి.భాస్కరరావు, ఎన్ శ్రీనివాస రావు, బి శ్రీను, ఎల్ కృష్ణ, ఆదినారాయణ, నరేష్, వాసు, కె. రమణ, బి.జగ్గునాయుడు, అర్జునరావు పాల్గొన్నారు.

గాజువాకలో సిపిఎం జెండా ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

తగరపువలస : సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన బైక్‌ర్యాలీని బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సుజాత నగర్ వరకు మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, ప్రజల పెద్దఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. సిఐటియు కార్యాలయం నుంచి జ్యూట్ కార్మికవాడ మీదుగా జంక్షన్, వై జంక్షన్ వరకు బైక్ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు, ఆటో, ముఠా కార్మిక సంఘం నేతలు నీలాతి రాము, పల్లా పెంట రాజు, నమ్మి నాయుడు,రీసునరసింగరావు పాల్గొన్నారు

తగరపువలసలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న గంగారావు

గాజువాక : జివిఎంసి 65 వ వార్డు భానోజీతోట పార్టీ కార్యాలయం వద్ద సిపిఎం జెండాను జోన్ నాయకుడు ఆర్. నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ఈనెల 28న పెందుర్తిలో మహాప్రదర్శన, బహిరంగసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎం నాగేశ్వరరావు, టి శ్రీనివాస్, ఎం జ్యోతి, సిహెచ్ అప్పారావు పాల్గొన్నారు..

విశాఖ కలెక్టరేట్ : పెందుర్తిలో సిపిఎం జిల్లా మహాసభల నేపథ్యంలో బుధవారం కంచరపాలెం కార్యాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకులు పెంటకోట రామారావు, బర్మా క్యాంపులోపార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.కమల పతాకావిష్కరణ చేశారు. పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ అధ్యక్షతన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో 72ఏళ్లుగా కార్మికులు, కష్టజీవుల తరపున సిపిఎం అవిశ్రాంతంగా అనేక అనేక పోరాటాలు, త్యాగాలు చేసి, బలమైన ప్రజా పోరాటాలను నిర్వహించి ందన్నారు. పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.అప్పలరాజు,ఎస్ సోమేశ్వర రావు, ఒమ్మి అప్పారావు, బి.సింహాచలం, జి.అప్పలరాజు, ఎం. ఈశ్వర రావు, ఎస్.శ్రావణ్, ఎస్.ఆదిలక్ష్మి, ఒ.విజయ, ఎం. కల్యాణి, పి.శారద, సిహెచ్ రాజా, కె.అనురాధ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పార్టీ జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన ఎం.సుబ్బారావు అధ్యక్షతన బైక్ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం కార్యాలయం వద్ద ర్యాలీని పార్టీ సీనియర్ నాయకులు పి.వెంకటరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పార్టీ కార్యాలయం నుంచి జగదాంబ జంక్షన్, పోలీస్ బ్యారెక్స్, పూర్ణా మార్కెట్, టౌన్ కొత్త రోడ్డు, దుర్గాలమ్మ టెంపుల్, డాబా గార్డెన్స్, ఆర్‌టిసి కాంప్లెక్స్, జివిఎంసి ఆఫీస్, జగదాంబ జంక్షన్ పార్టీ ఆఫీసుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్, నాయకులు వై.రాజు, కె.చంద్రశేఖర్, కె. నర్సింగరావు, చంద్రమౌళి, స్రవంత్, సంతోష్ కుమార్, ఎల్‌జె.నాయుడు, పి.మణి పాల్గొన్నారు.

అరిలోవ : సిపిఎంవిశాఖ జిల్లా 24వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఆరిలోవ పార్టీ కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్ ఆవిష్కరించారు. జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూడేళ్లకోసారి కిందిస్థాయి నుంచి అఖిలభారత స్థాయి వరకు నిర్వహించే మహాసభల్లో భాగంగా ఈనెల 28న పెందుర్తిలో బహిరంగసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిహెచ్ నరసింగరావు, కె.లోకనాథం, ఎంవిఎస్ శర్మ తదితరులు హాజరౌతారన్నారు. సిపిఎం నేతలు వి.నరేంద్ర కుమార్, పి.శంకర్, డి.నాగరాజు, ఎస్.రంగమ్మ, అన్నపూర్ణ, గౌరీ, కాంతం, భాస్కర్, గోపి, సూర్యనారాయణ, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

కంచరపాలెంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపెం నేతలు

ఆరిలోవలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

'ఓలా' షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- పెందుర్తి : దేశంలో అతిపెద్ద ప్యూర్‌ప్లే ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ షోరూం, సర్వీస్ సెంటర్‌ను బుధవారం పెందుర్తి జంక్షన్‌లో మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ఇపుడు వాహనదారులు మక్కువ చూపుతున్నారని,భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనన్నారు. ఈ సందర్భంగా ఓలా కోస్టల్ సిటీలీడ్ వాన లోకేశ్వరరావు మాట్లాడుతూ ఇవి రంగంలో ప్రముఖమైన ఓలా నెట్‌వర్క్ ఇపుడు దేశవ్యాప్తంగా నాలుగు వేల స్టోర్లు, 3,200 సర్వీస్‌సెంటర్లకు విస్తరించిందన్నారు. అతి తక్కువ ధరకు ఎన్నో ఫీచర్లతో లభిస్తున్నాయని తెలిపారు. ఓలా ఏరియా సర్వీస్ మేనేజర్ డీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ. ఎస్1 పోర్ట్ ఫోలియోపై రూ.25 వేల వరకు ఆకర్షనీయమైన ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని వినియోగించుకోవాలన్నారు.

పెందుర్తిలో ఓలాషోరూం ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

అపర్ణకు కేంద్రమంత్రి అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు 2024 అందుకున్న కూచిపూడి నృత్యకళాకారిణి అపర్ణను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. గురువారం విశాఖ విమానాశ్రయంలో కేంద్రమంత్రి రామ్మోహన నాయుడును అపర్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అపర్ణను ప్రశంసలతో ముంచెత్తిన కేంద్ర మంత్రి, తెలుగువారి ప్రతిభ. ఆంధ్రుల అత్యుత్తమ కౌశలానికి తార్కాణంగా నిలిచిన అపర్ణ, కూచిపూడి నత్యానికి ఐకాన్ కావాలని ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి. ఉన్నత కీర్తి కిరీటాలు అందుకోవాలని, ఉన్నత ప్రజ్ఞతో రాణిస్తున్న అపర్ణకు మంచిభవిష్యత్తు ఉందని ఆశీస్సులందించి, అభినందించారు.

ముఠా కార్మికుల కూలి రేట్లు పెంపుపై ప్రభుత్వం స్పందించాలి

ముఠా కార్మిక సంఘం నాయకులు

నినాదాలు చేస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణ ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంపుపై ప్రభుత్వం స్పందించాలని ముఠా కార్మిక సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. ముఠా కార్మికుల సమావేశం బుధవారం మార్కెట్ వద్ద జరిగింది. అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు భీశెట్టి అప్పారావు మాట్లాడుతూ ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలని నోటీసు ఇచ్చి 20 రోజులైందని తెలిపారు. యజమానులు కూలి రేట్లు పెంపుకు ఇప్పటికే మూడు దఫాలుగా చర్చలు జరిపారని, కనీసం కూలిరేటు పెంపు చేయడానికి సిద్ధంగా లేరని వాపోయారు. నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం, ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. బస్తాలు మోసి మోసి కార్మికులు ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూలి రేట్లు పెంచడానికి యజమానులు చర్చలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే గురువారం నుంచి జరుగే సమ్మెకు యజమానులే బాధ్యత వహించాల్సిన ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, తిర్రి సురేషు, కాపుశెట్టి అప్పారావు, నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

నేటి నుండి వ్యాపార సంస్థలు బంద్

ఈనెల 26 నుంచి వ్యాపార సంస్థలు బంద్ చేస్తున్నట్లు అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి రైస్ మర్చంట్స్ అసోసియేషన్, ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ముఠావర్కర్స్ కూలి రేట్లు పెంచమని ఇచ్చిన దానిపై మూడు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ వారు అంగీకరించలేదని, ప్రస్తుతం కూలిరేట్లకు అదనంగా 50శాతం రేట్లు పెంచితేనే పనిచేస్తామని లేకుంటే ఈనెల 26 సమ్మె చేస్తామని వారు నోటీస్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇంత మొత్తంలో కూలి రేట్లు పెంచితే వ్యాపార వర్గం మీద ప్రభావం పడుతుందని, అందుకే ఈనెల 26 నుండి వ్యాపార సంస్థలు బంద్ చేయాలని అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారని తెలియజేశారు.

పెట్రోల్ బంకు వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

పెట్రోల్ కల్తీపై బంకు వద్ద ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కల్తీ పెట్రోల్, నీళ్ల కలిసిన పెట్రోల్‌ను విక్రయిస్తున్నారంటూ మండలంలోని రాజాం గ్రామానికి చెందిన పలువురు బుధవారం ఉదయం పెట్రోల్ బంకు వద్ద ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన పలువురు స్థానిక పెట్రోల్ బంక్ వద్ద తమ వాహనాల్లో పెట్రోల్ వేయించుకోగా నీళ్ల కలిసిన, కల్తీ పెట్రోల్ వచ్చిందని తమ వాహనాలు మరమ్మతులకు గురయ్యాయని వారు నినాదాలు చేశారు. బంకు యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక సర్పంచ్ మరిసా నాని ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు.

వరి పంట రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను తుఫాన్ తాకిడికి దెబ్బ తినకుండా కాపాడుకునేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి సూచించారు. పొలం పిలుస్తుందో భాగంగా బుధవారం అనకాపల్లి మండలం పిసినికాడ, తుమ్మపాల, దిబ్బపాలెం, బవులవాడ గ్రామాల్లో ఆయన క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు చేసిన వాళ్ళు పనలను కుప్పలుగా వేసుకోవాలన్నారు. పంట కోయని వాళ్ళు రెండు రోజులు ఆగిన తర్వాత కోసినట్టయితే తుఫాన్ నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. వర్షానికి పనలు తడిస్తే లీటర్ నీటికి 50 గ్రాములు ఉప్పు కలిపి పిచికారి చేస్తే ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటుందని తెలిపారు. మండలం మొత్తం మీద 2509 హెక్టార్లకు ఇప్పటివరకు 1640 హెక్టార్లలో వారి కోసి కుప్పలుగా వేసుకోవడం జరిగిందని, 281 హెక్టార్లు వరి పనలపై ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఇంకా 588 హెక్టార్లు పంట కోయవలసి ఉందని, దీన్ని తుఫాను ప్రభావం తగ్గిన తర్వాత కోసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు పార్వతి, సాయి, గణేష్, ఆత్మ రామకష్ణ రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్ సిఐ స్వామినాయడుకు అందిన సమాచారం మేరకు బుధవారం తమ సిబ్బందితో మండలంలోని లాలం కొత్తూరు గ్రామం శివారు వద్ద కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. అక్కడ కొంతమంది కోడిపందాలు ఆడుతుండగా పోలీసులకు ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. ఆయన వద్ద నుండి వెయ్యి రూపాయలు నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వాళ్లందరూ పారిపోయారు. పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నీటి నాణ్యత పరీక్ష కిట్లు అందిస్తున్న దృశ్యం

క్షీణిస్తున్న నీటి నాణ్యతతో మానవాళికి ప్రమాదం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచవ్యాప్తంగా క్షీణిస్తున్న నీటి నాణ్యతతో మానవాళికి, పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందని నోబుల్ చారిటీస్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శరగడం నూకరాజు అన్నారు. డాక్టర్ ఎస్ఎన్ఆర్ నోబుల్ చారిటీస్ అధ్యక్షురాలు ఎస్ జయలక్ష్మి అధ్యక్షతన నీరు, పారిశుధ్యం పై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాస్టర్ మాట్లాడుతూ నీటి నాణ్యతను పరీక్షించేందుకు అనేక పరీక్షలు ఉన్నాయన్నారు. నాణ్యత ఒక ప్రదేశానికి ఋతువులను, మట్టి, రాళ్లను బట్టి మారుతుందని తెలిపారు. ఇవి నీటి నాణ్యతను ప్రభావితం చేసే సహజ ప్రక్రియ అన్నారు. సందర్భంగా నీటి నాణ్యతను పరీక్షించే కిట్లను శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, విశ్వభారతి జూనియర్ కళాశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాస్టారును సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల కరస్పాండెంట్లు మల్ల మురళి, జి నానాజీ, ఏ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

పండిన వరి పంట

కోత కోసుకోలేని దుస్థితిలో రైతులు

ముర పండిపోయిన వరి చేను

ప్రజాశక్తి-కె.కోటపాడు

వరి పంట పండిపోయి కళ్ల ముందు కనిపిస్తున్నా దానిని కోసుకోలేని దుస్థితిలో వరి రైతులు సతమతమవుతున్నారు. దిగుబడి బాగా వచ్చినప్పటికీ నేటికీ 20 శాతం ప్రజలు ఇంకా వరికోతలు పూర్తి చేయలేదు. నెల రోజులుగా వరుస తుపాన్ల కారణంగా పండిన వరి పంట కోయలేని పరిస్థితి నెలకొంది. పండి పంటను ఇంటికి చేర తీసుకునే అవకాశం లేకపోయింది. ధైర్యం చేసి కోతలు కోసిన పంట తుఫాన్ల కారణంగా కురిసిన వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. ముఖ్యంగా మండలంలోని కె కోటపాడు, మేడచర్ల, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, పైడంపేట తదితర గ్రామాల్లో ఈ దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఇంకా కోతలు పూర్తికాలేదు. మరికొన్ని చోట్ల ఆయా మడుల్లోనే కోసిన వరి చేనును చిన్న చిన్న కుప్పలు వేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టితే తమ వరి పంటను కల్లాల్లోకి చేర్చుకునేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.

అమృత హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని చోడవరం రోడ్‌లో డాక్టర్ షణ్ముఖ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత హాస్పిటల్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, పెందుర్తి టిడిపి ఇన్చార్జ్ గండి బాబ్జి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బవరం మండల ప్రజలకు 24 గంటలు వైద్య ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోటాన రాము, మాజీ ఎంపీపీ గండి దేముడు, గండి ముత్యాల నాయుడు, భరణికాన సాయినాథరావు, జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, మామిడి శంకర్రావు, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ,గొర్లి కుమార స్వామి, టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న గండి బాబ్జి, పంచకర్ల రమేష్‌బాబు

వరి రైతులను నిండా ముంచిన వర్షాలు

వారం రోజులుగా నీటిలోనే వరి పనలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఎకరాకు పాతిక ముప్పై వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టి వరి పంటలు పండించిన రైతులకు ప్రకృతి నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని ప్రతి గ్రామంలోనూ వందలాది ఎకరాల్లో వరి పంట పొలాల్లోనే ఉంది. ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో వరి పంటను ఒడ్డుకు చేర్చే మార్గం లేక పొలాల్లోనే రైతులు విడిచిపెట్టారు. కొంతమంది రైతులు వరి నూర్పిడి యంత్రాలతో నేర్పించి పొలాల్లోనే ధాన్యం విడిచిపెట్టారు. మండలంలోని చిన్న అప్పన్నపాలెం గ్రామానికి చెందిన దొండ నారాయణమూర్తి, దొండ వెంకటరమణకు చెందిన నాలుగు ఎకరాల్లో కోసి నూర్చిన ధాన్యం పొలంలోనే విడిచి పెట్టడంతో తడిసి అట్టలు కట్టాయి. దిబ్బిడి గ్రామానికి చెందిన గంట మాలిబాబు, గంట సన్యాసినాయుడు, పెద్దిరెడ్డిల గంగరాజు తదితర రైతులకు చెందిన వరి పంట నీటిలోనే ఉంది. బుధవారం ఉదయం నుండి కురిసిన వర్షం పొలాల్లో మరింత నీరు చేరింది. వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నీటిలో ఉన్న వరి పనలను తీస్తున్న రైతు

శిక్షణలో పాల్గొన్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

ఫొటో, వీడియో గ్రాఫర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండపంలోని శ్రీదుర్గమాంబ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోనీ వర్క్ షాప్ నటరాజ్ కిషోర్ సహకారంతో బుధవారం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్‌కు శిక్షణా తరగతులు నిర్వహించారు. గొట్టివాడ దరి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోనీ కెమెరా స్పెషలిస్ట్ సతీష్ శెట్టి, షారుక్ మొహద్ పాల్గొని ఫోటోగ్రఫీలో వివిధ అంశాల గురించి, సాంకేతిక పరమైన స్కిల్స్‌ను వివరించారు. విశాఖ జిల్లా ఫోటోగ్రఫీ అధ్యక్షులు మధు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్‌కి ఇంత విలువైన శిక్షణ కార్యక్రమం నిర్వహించిన సబ్బవరం ఫోటోగ్రాఫ్ అసోసియేషన్‌ను అభినందించారు. సోనీ కంపెనీ నుంచి వచ్చిన సతీష్, సాయి ప్రసాదుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక ఫోటోగ్రఫీ ప్రెసిడెంట్ మధు, అనకాపల్లి ఫోటోగ్రఫీ ప్రెసిడెంట్ రమేష్, శ్రీదుర్గమాంబ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ ఎన్.రాజేష్, సెక్రటరీ బి.శివ, జాయింట్ సెక్రెటరీ జి.మధు, ట్రెజరర్ ఎస్.శివ, గౌరవ అధ్యక్షులు ఎస్.నాగేంద్ర, పి.కిషోర్, ఎన్‌వివిఎస్.శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు, ఎం.రాము, ఎం.రమణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా రింగురోడ్డులో ఆయన విగ్రహానికి మాజీ శాసన మండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బుద్ద భువనేశ్వరరావు, బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు పోలిమేర నాయుడు, చదరం శివ అప్పారావు పాల్గొన్నారు.

నక్కపల్లి : నక్కపల్లిలో బిజెపి కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాజ్ పాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాకలపాటి రవిరాజు, శ్రీరంగం రమేష్, పోలినాటి నానాజీ, దాడిశెట్టి ఈశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇబ్బందులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం పరిధిలోని పెదగంగవరం - వాలాబు ఆర్ అండ్ బి రోడ్డు నుండి దేవరాపల్లి - పెదకోట ఆర్ అండ్ బి రోడ్డు వరకు పెదగంగవరం - జీనబాడు మీదుగా 1.56 కిలోమీటర్ల మేర రూ.59 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ తారు రోడ్డు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేశారు. ఈ రోడ్డు పూర్తి చేయటం ద్వారా మొత్తం 580 జనాభా కలిగిన పెదగంగవరం గ్రామాలకు రహదారి సౌకర్యం కలిగింది. ఈ రోడ్డు నిర్మాణం పట్ల స్థానిక గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల తమకు విద్య, వైద్య, వ్యాపార పరమైన వసతులు మరింత చెరువయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ తారు రోడ్డు నిర్మాణం జరగక ముందు ప్రజలు ఎంతో ఇబ్బందులతో ఆసుపత్రికి వెళ్లడం జరిగేది. ఈ తారు రోడ్డు వేయుడం వలన విద్యార్థులకు నడక బాధలు తప్పి ఎంతో మేలు జరిగిందని ఈ ప్రాంత ప్రజలు, పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు.

నిర్మాణం జరిగిన పెద గంగవరం- జీనబాడు రోడ్డు

ప్రభుత్వ భవనాలకు మోక్షం ఎప్పుడు?

- ఖాళీగా ప్రభుత్వ భవనాలు!
- వినియోగంలో లేక శిథిలావస్థకు

ఖాళీగా ఉన్న ఐసిడిఎస్ భవనం

ప్రజాశక్తి- కశింకోట

మండల కేంద్రంలో పలు ప్రభుత్వ భవనాలు వినియోగంలో లేక ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా ఆయా భవనాలు వాడకంలో లేకపోవడంతో శిథిలమైపోతాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు గ్రామస్తులు కోరుతున్నారు.

మండల కేంద్రంలో మండల విద్యాశాఖ భవనం, ఎస్‌సి హాస్టల్ (ఐసిడిఎస్) భవనం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో ఇక్కడున్న ఎస్‌సి హాస్టల్‌ను మూసేశారు. దీంతో ఎస్‌సి హాస్టల్ నిర్వహించే భవనం ఖాళీ కావడంతో దానిలో మహిళా స్త్రీ శిశు సంక్షేమ భవనం నిర్వహించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఐసిడిఎస్ ప్రాజెక్టులను కుదించడంతో కశింకోట ప్రాజెక్టులను అనకాపల్లిలో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం కొన్నాళ్లుగా ఆ భవనం ఖాళీగా ఉంది.

ఇక మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం నిర్వహించే భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని ఖాళీ చేసి వదిలేశారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ భవనం మరింత అధ్వాన్నస్థితికి చేరుకుంటోందని స్థానికులు అంటున్నారు. ఇక విద్యాశాఖ కార్యాలయాన్ని దగ్గరలో ఉన్న పాత పాఠశాల భవనంలోకి మార్చారు. వర్షం పడితే అక్కడా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇక మండలంలోని రేషన్‌డిపోలకు బియ్యం, ఇతర సరుకులను సరఫరా చేసే గోదాం భవనం సగం వరకు కూలిపోయింది. ప్రస్తుతం ఉగ్గినిపాలెంలో పౌరసరఫరాల గోదాం నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో వినియోగంలో లేక ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

పౌరసరఫరాల గోదాము

మండల విద్యాశాఖ కార్యాలయ భవనం

విద్యుత్ ఛార్జీలపై

27న ధర్నాను జయప్రదం చేయండి

పోస్టర్లు ఆవిష్కరించిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-చోడవరం

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన బుచ్చయ్యపేట మండలం వడ్డాది విద్యుత్ శాఖ ఏడి కార్యాలయం వద్ద జరుగు ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఈ మేరకు చోడవరంలో ధర్నా పోస్టర్లు విడుదల చేశారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి, నేడు రూ.15 వేల కోట్లు భారాలు గృహ వినియోగదారులపై మోపేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున పోరాటం చేస్తామని, దీనికి అందరూ సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, వెంపలి ఆనందీశ్వరరావు, సేనాపతి సత్యారావు, పల్ల నర్సింగ్‌రావు, శ్రీనివాసరాజు, బగ్గు శ్యామల, పతివాడ అప్పారావు, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : విద్యుత్ చార్జీల పెంపుపై ఈనెల 27న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పోరుబాటను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మెయిన్ రోడ్‌లో గల ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో పోరుబాట పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై జరుగు ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, బీసెట్టి గంగ అప్పలనాయుడు, వైసిపి నాయకులు కోనపల్లి రామ్మోహన్ రవు, దాసరి అప్పారావు, నరాల శెట్టి సూర్యనారాయణ, శరగడం జగన్నాధ రావు, దొడ్డి వరాహ, కాండ్రేగుల జగన్, పల్లె అప్పలనాయుడు, ఆడారి కాశి బాబు, రాజాన బుజ్జిబాబు పాల్గొన్నారు.

మునగపాకలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్, వైసిపి నాయకులు

దేవరాపల్లి : కరెంట్ చార్జీలపై ఈనెల 27న మాడుగుల సబ్ స్టేషన్ వద్ద జరుగు ధర్నాను తరలిరావాలని వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాడుగుల నియోజకవర్గం సమన్వయకర్త ఈర్లె అనురాధ ఆధ్వర్యంలో జరుగు ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గోవాడ సుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

గ్యారేజ్‌లో చెరుకు వేస్తున్న సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ చక్కెర కర్మాగారం క్రషింగ్ ఎండి వి.సన్యాసినాయుడు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 9.30 గంటలకు గ్యారేజ్‌లో చెరుకు వేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది లక్ష 70 వేల టన్నులు చెరుకు గానుగాట లక్ష్యంగా చేసుకున్నామన్నారు. దీని కోసం పదివేల మంది రైతులు వద్ద అగ్రిమెంట్ తీసుకోవడం జరిగిందని చెప్పారు. గత సీజన్ రైతులకు కార్మికులకు ఇవ్వవలసిన బకాయిలు బకాయిలు 12 కోట్ల రూపాయల వరకు ఉన్నట్లు చెప్పారు. ఫ్యాక్టరీకి రావలసిన ఏడు కోట్ల రూపాయలు ఉన్నాయని సంక్రాంతి ముందు రైతులు బకాయిలు చెల్లించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. వచ్చే సీజన్లో 15 రోజులు పేమెంట్ రైతులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ ఏడాది ఎప్పటిలాగే విత్తనం, వంటి కళ్ళు మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. వర్షాలు కారణంగా అంతరాయం ఏర్పాటు చేయడం వల్ల నాలుగైదు రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడివో రాము, యూనియన్ నాయకులు రామ నాయుడు, రావి సూరిబాబు ఫ్యాక్టరీ ఉద్యోగులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బకాయిలు చెల్లించకుంటే క్రషింగ్ సరికాదు

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించకుండా క్రషింగ్ ప్రారంభించడం సరికాదని జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి పివిఎస్ఎన్ రాజు అన్నారు. రైతులతో స్థానిక ఎండి వి సన్యాసినాయుడును బుధవారం కలిసి ఫ్యాక్టరీ స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనేజ్‌మెంట్‌పై అనేక అవినీతి ఆరోపణలను వస్తున్నాయని, వాటిని ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. రైతుల సంక్షేమానికి కీలకమైన ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. చక్కెర రైతుల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం నుండి ఆర్థిక ప్రయోజనాలు కూడగట్టేందుకు చోడవరం జనసేన పార్టీ చురుకుగా పని చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లం రామ అప్పారావు, గూనూరు సూర్యనారాయణ, కర్రి రమేష్, మంగా శ్రీను, గూనూరు మూలునాయుడు, పీలా మహేష్, దాడి వెంకట అప్పారావు, చప్పగడ్డ శ్రీను, టి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

గొలుగొండలో వ్యాక్యాన్ని బోధిస్తున్న పాస్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నక్కపల్లి, ఉద్దండపురం, కాగిత, వేంపాడు, చందనాడ, డిఎల్ పురం, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ పార్టీ నాయకులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా క్రిస్టియన్ సోదరులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలను అందంగా ముస్తాబు చేయడంతో పాటు నూతన వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వెంకటాపురంలో క్రిస్మస్ సంబరాలు

ఎస్.రాయవరం: మండలం,లో వెంకటాపురం బేతేలు చర్చిలో క్రిస్మస్ సంబరాలు పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ డి.విక్టర్ పాల్‌ని పిఆర్ టియు సంఘ నాయకులు ఘనంగా సన్మానించి, చిరు జ్ఞాపికతో సత్కరించారు.. పిఆర్‌టియు మండల అధ్యక్షులు భద్రరావు మాట్లాడుతూ,ఆధ్యాత్మిక చింతన ద్వారా సమాజంలో మంచి విలువలను పెంపొందించవచ్చున్నారు. ఏసుక్రీస్తు బోధనలో శాంతి మార్గాన్ని అనుసరించాలన్నారు. పాస్టర్ విక్టర్ పాల్ సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ధర్మవరం అగ్రహారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, రమేష్, కొండబ్బాయి, ప్రకాష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: రామారావుపేట లోని బెతేస్థ ప్రార్థన మందిరంలో బుధవారం క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత రాత్రి నుండి నర్సీపట్నంలోని పలు చర్చిలలో క్రిస్టమస్ సందడి నెలకొంది. సిబిఎం కాంపౌండ్‌లోని బాప్టిస్ట్ చర్చి, పెద్ద బొడ్డేపల్లిలోని ఆర్‌సిఎం చర్చి తదితర ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బెతెస్థ చర్చిలో జరిగిన కార్యక్రమంలో హెబ్రోను (హైదరాబాద్)నుండి వచ్చిన బ్రదర్ పాల్ వాక్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవులందరి పాపముల నిమిత్తం సిలువపై తన ప్రాణాలను ఏసుక్రీస్తు అర్పించారన్నారు.ఈ వేడుకలలో సంఘ పాస్టర్ జి నరేష్ తిమోతి, సంఘ పెద్దలు నతానియేలు, ప్రసాద్, నోవాహు, మూర్తి, డేవిడ్, సత్యం, బ్రదర్ బర్నబాస్, జీవన్ రాజు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు బుధవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఏఎల్.పురం, గొలుగొండ, పాకలపాడు, తదితర గ్రామాల్లో ప్రార్థనా మందిరాల్లో ఈ వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అనకాపల్లి:అనకాపల్లిలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అనకాపల్లి బాప్టిస్ట్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవలకు శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానీ, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ పాల్గొన్నారు.

స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలల చైర్మన్ ఎంఎస్.మణి, ఆంధ్రా జోనల్ ఇన్చార్జ్ యన్.వెంకటేష్, సీజీయం జీఆర్.వసంత, పాఠశాల ప్రిన్సిపాల్ జి.విజయ్, డీన్ సుధలతా ఏజిఎంజివిఎస్.మూర్తి, ఉపాధ్యాయు నులు పాల్గొన్నారు.

టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సెంటినరీ బాపిస్ట్ చర్చిలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, గోల్డ్ వాసు, జోసఫ్ పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ జయరజని కేక్‌ను భరత్ కుమార్‌కు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయడు, పెంటకోట శ్రీనివాసరావు, పిటర్ వైజమెన్ పాస్టర్ పాల్గొన్నారు. జామదలుపాలెం చర్చిలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకులు కరక సోమునాయడు పాల్గొన్నారు. తాళ్ళపాలెం, బయ్యవరం, కన్నురుపాలెం, నర్సింగబిల్లి చర్చిల్లో సేవా కార్యక్రమం నిర్వహించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్టియన్లు శు భాకాంక్షలు తెలుపుతున్నారు.

సబ్బవరం : సబ్బవరం సిబిఎం చర్చి పాస్టర్ ఎస్.జోష్య కెనడీ, వి. చర్చల్, జి జోషప్ రాజు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, మామిడి శంకరరావు, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ, గొర్లి కుమార స్వామి పాల్గొన్నారు. సబ్బవరం గ్రేస్ అఫ్ గాడ్ సంఘం, అమృతపురం రేమా బ్లెస్సింగ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

పోర్టు స్టేడియంలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో చర్చిలో పాస్టర్ బంగారి సాల్మన్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రునాయుడు కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. స్థానిక సర్పంచ్ దాడి జగన్ మాల మహానాడు జిల్లా కార్యదర్శి తాడి చంటి, గొర్లె గోవింద, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి చర్చిలో మాట్లాడుతున్న భరత్

మధురవాడ : జివిఎంసి ఆరోవార్డు పిఎం.పాలెం బేతని ప్రాంగణంలో బేతని సంస్థల చైర్మన్, ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.ఏసుపాదం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు బేతని పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.మోనికా యేసుపాదం, మినిస్ట్రీస్ అడ్మినిస్ట్రేటర్ సునీల్ పాల్గొన్నారు.

పరదేశీపాలెం బోయపాలెంలో నేతన్య చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. బిషప్. డాక్టర్ కెఆర్. సింగ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వై.ఆమోసు, జి.జాన్‌బాబు పాల్గొన్నారు.

పద్మనాభం.: మండలంలోని మద్ది, వికెపాలెం, పద్మనాభం, రెడ్డిపల్లి, కృష్ణాపురం, పాండ్రంగి, అయినాడ, తునివలస తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు పాల్గొన్నారు. మద్ది గ్రామంలో ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార :ఎండాడ మిరకల్ సెంటర్,శామ్యూల్ కర్మోజీ మినిస్ట్రీస్ అక్కయ్యపాలెం ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో యూనివర్శల్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన క్రైస్తవులతో స్టేడియం కిటకిటలాడింది. మిరకల్ సెంటర్, శామ్యూల్ కర్మోజీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు శామ్యూల్ కర్మోజీ, సుస్మిత కర్మోజీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జన్మదిన శుభ సందేశాన్ని అందించారు. వేడుకల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్,కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు. శామ్యూల్ కర్మోజీ, ఆర్ఎస్ దీపు, శ్రేష్ట,సహాస్ జోయెల్ కర్మోజీల ఆధ్వర్యంలో మిరకల్ సెంటర్ చర్చి కోయిర్‌టీమ్ ఆలపించిన క్రిస్మస్ భక్తిగీతాలు ఉత్సహాన్ని, ఉల్లాసాన్ని నింపాయి. వేడుకల్లో పాల్గొన్న క్రిస్టియన్లకు నూతన సంవత్సర కేలండర్లు పంపిణీ చేశారు.

విశాఖ కలెక్టరేట్ : నగరంలో క్రిస్మస్ వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. పెద్ద పెద్ద చర్చిలలో వరుసగా రెండు, మూడు ప్రార్థనలు నిర్వహించారు. కొన్ని చర్చిలలో అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు చేపట్టారు. రోజ్ హిల్స్, లండన్ మెషనరీ చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు.

బీచ్ రోడ్డులో బాలవికాస ఫౌండేషన్ ఆధ్వర్యాన బ్రిడ్జి స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. ఫాదర్ ఫ్రాన్సిస్ క్రీస్తు గేయాలను ఆలపించారు. ఈ వేడుకలలో డాక్టర్ బాబ్జి, లక్ష్మి, రమ, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కేక్ కట్ చేసి, క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెల్వరాజ్, పోలారావు, సతీష్, శంకర్, అప్పన్న, ధన రెడ్డి, సత్యనారాయణ, కనకరాజు పాల్గొన్నారు.

మండల కమిటీల్లో సర్పంచ్‌లకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి -రావికమతం: దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదిక మండల స్థాయి కమిటీలో ఆయా గ్రామాల సర్పంచ్‌లకు స్థానం కల్పించాలని మండలంలో కవగుంట గ్రామానికి చెందిన సర్పంచ్ దాసరి సూర్యకుమారి, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి శనివారం మండల కేంద్రంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదిక పేరుతో మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవో, సబ్ ఇన్స్పెక్టర్‌లతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు.ఈ కమిటీలో ఆయా గ్రామాల సర్పంచ్‌లను విధిగా చేర్చాలని వారు కోరారు. ఆయా గ్రామాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై గ్రామ సర్పంచులు పూర్తి అవగాహన కలిగి ఉంటారన్నారు. వీరి తాలూకా సూచనలు, సలహాలు ఈ కమిటీకి చాలా కీలకమన్నారు. ఆయా గ్రామానికి సంబంధించిన ప్రథమ పౌరుడిని పక్కనపెట్టి అధికారులు ఈ సమస్యల పరిష్కారాలను నిర్ణయించడం అనేది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మండల స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లాలని కోరారు.

'వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ మృతిపై డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపట్టాలని రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పాపారావు డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ,. వైద్యం అందించడంలో డ్యూటీ డాక్టర్ల, సిబ్బంది నిర్లక్ష్యం వహించిన వారందరి పై తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు డ్యూటీ అయ్యేంత వరకు రోగుల పట్ల శ్రద్ధ చూపి మెరుగైన వైద్యం అందించేందుకు ఆసక్తి చూపలేదన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేసే డాక్టర్లు ప్రైవేటు క్లినిక్లు పెట్టుకుని గవర్నమెంట్ హాస్పిటల్‌కు వచ్చ పేషెంట్ల పై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.ప్రవేటు క్లీనిక్‌ల పేరుతో సొమ్ము చేసుకుంటున్న డాక్టర్లను తక్షణమే నిబంధన ప్రకారం లైసెన్స్ రద్దు చేయాలన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీ పెద బొడ్డేపల్లి మరిడిమాంబ కాలనీలో బుధవారం సిపిఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకి రెడ్డి రామునాయుడు పతాక ఆవిష్కరణ చేశారు అనంతరం మాట్లాడుతూ, బ్రిటీష్ వలసపాలనకు, కుల వ్యవస్థ, భూ సంస్కరణలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం చేసిందన్నారు.భూస్వామ్యలకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని నిర్వహించిందన్నారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సి.హెచ్ క్రాంతి, జిల్లా సమితి సభ్యులు శివలంక కొండలరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, టౌన్ సమితి సభ్యులు పావాడ సత్యనారాయణ, రామయమ్మ తదితరులు పాల్గొన్నారు.

71 మద్యం సీసాలను సీజ్ చేసిన పోలీసులు

-గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం నక్కపల్లిలో ఉపమాక ఆర్చి వద్ద తనిఖీలు చేపట్టగా జానకయ్యపేటకు చెందిన కురుందాసు లోవరాజు తన బైక్ పై 71 మద్యం సీసాలను తరలిస్తుండగా, పోలీసులకు పట్టుబడ్డాడు. మద్యం సీసాలను, బైక్ ను స్వాధీన పరుచుకుని,అతనిపై కేసు నమోదు చేసిన్నట్లు సీఐ కుమార స్వామి వెల్లడించారు.

ఇదిలా ఉండగా గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణలో టెండర్ షాపుల యాజమాన్యాల హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులకు టెండర్ షాపుల యాజమాన్యం ప్రోత్సహిస్తుందని, వారికి కావలసిన మద్యం సీసాలను సరఫరా చేస్తున్నారని, దీని మూలంగానే గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం ఏరులై పారుతోందని, దీంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో నాటు సారా, అందుబాటులో మద్యం లభించడంతో చాలామంది మద్యానికి బానిసై అనారోగ్యాల బారిన పడుతున్నారు. పలువురు మృత్యువాత పడుతున్నారు. కుటుంబాల్లో తగాదాలు, కలహాలు చోటు చేసుకుంటున్నాయి. అనేక కుటుంబాలలో మద్యానికి బానిసైన వారు మృత్యువాత పడడంతో కుటుంబాలు పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డున పడుతున్నాయి. ఎక్సైజ్, పోలీస్ యంత్రాంగం ముమ్మరంగా తనిఖీలు చేపట్టి గ్రామాల్లో నాటు సారా, బెల్ట్ షాపులు నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్వాధీనం చేసుకున్న సీసాలు, నిందితుడితో పోలీసులు

రైతులను ముంచిన అకాల వర్షాలు

-పొలాల్లో తడిసిన వరి పనలు- అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:అకాల వర్షం అన్నదాత కొంప ముంచింది. వరి పంట చేతికందే సమయంలో వర్షం కారణంగా నష్టం నిలిచింది. ఆరుగాలం శ్రమటోడ్చి పండించిన పంట అకాల వర్షానికి తడిసి పోవడంతో వరి గింజల పై పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. గత 4,5 రోజుల నుంచి ఆడపాదపా కురిసిన వర్షంతో పాటు, మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పూర్తిగా పొలాల్లో ఉన్న వరి పనలు నీట మునిగాయి. కోతకు వచ్చిన వరి అక్కడక్కడ నేల మట్టమయింది. దీంతో అన్నదాత ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న చివరి గింజలు వర్షార్పణమయ్యాయి.

మండలంలో 4700 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వరి సాగు ఎంతో ఆశాజనకంగా ఉంది. రైతన్నలు అధిక పెట్టుబడులు పెట్టి వరి సాగు చేశారు. వరి పంట ఆశాజనకంగా ఉండడంతో, పెట్టుబడుల నుంచి ఉపశమనం లభిస్తుందని రైతులు భావించారు. పంట కోత దశకు చేరుకోవడంతో గత వారం పది రోజుల నుంచి రైతులు వరి కోతలు ప్రారంభించారు. కోతలు ఆరంభం నుంచే తుపాన్ హెచ్చరికలు, అకాల వర్షం అన్నదాతకు కంటిమీదకు నుకు లేకుండా చేసింది. అన్నదాతకు చినుకు భయం పట్టుకుంది. ఇప్పటివరకు 1159 ఎకరాల్లో కోతలు అయ్యాయి.122 ఎకరాల్లో కోత కోసిన వరి పొలాల్లో ఉంది. 985 ఎకరాల వరి పంటను కుప్పలు వేశారు. 52 ఎకరాల్లో వరి నూర్పు జరిగాయి. వర్షానికి భయపడి కోసిన వరి పనలు ఎండకుండానే పలుచోట్ల రైతులు ఆఘమేఘాల మీద కుప్పలు వేశారు. మరి కొన్నిచోట్ల ధాన్యం పచ్చిగా ఉన్నప్పటికీ నూర్పేశారు. దీంతో బియ్యం నాణ్యత లోపిస్తుంది. అయినప్పటికీ చినుకు భయంతో రైతులు ఇలా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అకాల వర్షం కారణంగా వరి పంట దెబ్బతినడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబో మంటున్నారు. వారం, పది రోజులు వర్షం ఆగితే పండిన పంటను రైతులు చక్కబెట్టుకునేవారు. అకాల వర్షం రైతులను నిలువునా ముంచేయడంతో, ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నక్కపల్లిలో తడిసిన వరి పనలు

కోటవురట్ల:గడిచిన 10 రోజులుగా వాయుగుండంతో రైతన్నలు అవస్థలు ఎదుర్కొంటు న్నారు. మండల వ్యాప్తంగా వరి పంట కోత సమయంలో అల్పపీడన ప్రభావం కారణంగా వర్షాలు కురుస్తు ఉండటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దాదాపు 40 శాతం వరి పంట ఇంకా పొలాల్లోనే ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో కోసిన పంటను, మరికొన్ని ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటను భద్రపరుచుకునేందుకు అవస్థలు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలను చూసి రైతు కన్నీరు పెడుతున్నాడు.

కోటవురట్లలో తడిసిన వరి పనలు

రాజుపేట, జల్లూరు, లింగాపురం, ఎండపల్లి, సహా పలు గ్రామాల్లో పంట ఇంకా కోత కోయల్సి ఉంది. కొన్ని ప్రదేశాల్లో కోసిన పంటలు తడిసి ముద్దవుతున్నాయి. పంటలు భద్ర పరుచుకునేందుకు తార్పాలియన్, కూలీలు దొరకక రైతన్నల దిక్కులు చూస్తున్నారు. ఆది సోమవారాలు కాస్త ఎండాకాలంతో ఊపిరి పీల్చుకున్న రైతన్నలు మంగళ, బుధవారాలలో వర్షం కురియడంతో రైతన్న ఆశలు అడియాసలు అయ్యాయి. కోసిన వరి పనలపై ఉప్పునీరును పిచికారి చేయాలని వ్యవసాయ అధికారులు తెలిపారు.

నక్కపల్లిలో ఒరిగిన వరి పంట

28న జాబ్ మేళా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 28న జరిగే జాబ్ మేళాను వినియోగించుకోవాలని ఎంపిడివో సత్యన్నారాయణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులకు ఇచ్చిన సమాచారం మేరకు.. 28వ తేదీ శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ స్పెషెన్ డిగ్రీ కళాశాలలో జరిగే మెగా జాబ్ మేళాకు మండలంలోని ప్రతి గ్రామంలో ప్రచారం చేపట్టమన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పనే లక్ష్యంగా ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలో సుమారు యాభైకి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సుమారు వెయ్యికి పైగా ఉద్యోగాలను వివిధ కంపెనీలలో అవకాశమున్నందున మండలంలో పదవతరగతి, ఇంటర్ డిగ్రీ, ఐటిఐ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు అన్ని గ్రామాల కార్యదర్శులకు గ్రామాలలో దండోరా ద్వారా సమాచారం అందించాలని సూచించినట్లు ఆయన తెలిపారు.

సుంకరమెట్ట కాఫీ తోటలో పర్యాటకులు

వర్షంలోనూ.. తరలివచ్చిన పర్యాటకులు

-ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-అరకు లోయ:పర్యాటక కేంద్రమైన అరకు లోయలో భారీ వర్షంలోనూ కూడా పర్యాటకుల సందడి చేశారు.క్రిస్మస్ సెలవు దినం కావడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పర్యాటకులు తరలివచ్చారు. దీంతో, అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు, గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, సుంకరమెట్ట కాఫీ తోటలు సందర్శకులతో కళకళలాడాయి. పర్యాటక సీజన్ ముగియ వస్తుండడంతో పర్యాటకుల తాకిడి పెరిగినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో అరకు ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ కూడా పెరిగింది. ముఖ్యంగా సుంకరమెట్ట కాఫీ తోటలో పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించి వీక్షిస్తున్నారు.

అరకు ఘాట్ రోడ్ లో నిలిచిన వాహనాలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -పాడేరు:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల 7వ తేదీ నుండి 13 వరకు జైపూర్, రాజస్థాన్ లో జరిగే సీనియర్ జాతీయ వాలీబాల్ (పురుషులు మహిళలు) క్రీడా పోటీలకు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఏ.జగన్మోహన్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ పురుషులు, మహిళల జట్లు రాష్ట్రస్థాయి ఎంపికలలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 27న ఉదయం 7 గంటలకు ఆధార్ కార్డు, ధ్రువ పత్రాలు, 10 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడలో వాలీబాల్ గ్రౌండ్ లో హాజరు కావలసినదిగా, తెలిపారు.

గర్భిణి మృతిపై ప్రభుత్వానికి నివేదిక

-వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్

మాట్లాడుతున్న రమేష్‌కిషోర్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణీ మృతి పట్ల ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ రమేష్ కిషోర్ చెప్పారు. ఈ ఘటనపై విచారణ కోసం బుధవారం అమరావతి నుంచి నర్సీపట్నం వచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా శారద, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ సమక్షంలో డాక్టర్లు, సిబ్బందిని విచారించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. తన ప్రాథమిక విచారణలో నొప్పులతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీని ఐసీయూ వార్డుకు, డెలివరీ వార్డుకి తరలించడం లో నిర్లక్ష్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. మొదటి కాన్పులో ఆపరేషన్ లేకుండానే ప్రసవం జరిగిందని చెప్పారు. వాస్తవంగా రెండో కాన్పు ప్రసవానికి వచ్చిన గర్భిణీ ఆసుపత్రిలోనే మరణించడం బాధాకరమన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎస్.రాయవరం మండలం చిన్నగుమ్ములూరు గ్రామం నుంచి షేక్ మహబూబా మున్నీసా (దేవి) రెండవ కాన్పు కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వచ్చారని చెప్పారు. మొదటి కాన్పు కూడా ఇక్కడే జరగడంతో, సెంటిమెంట్ గా భావించి పక్కనే నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా, వారు ఇక్కడికి రావడం జరిగిందన్నారు. వైద్య సిబ్బంది సేవలు అందించడంలో అంతా సక్రమంగానే వ్యవహరించారని రికార్డు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. అయితే ఉమ్మనీరు పోవడం, బీపీ తగ్గిపోవడం, ఇతర ఆరోగ్య సమస్యలతో కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ప్రాణ నష్టం జరిగిపోయిందని డాక్టర్లు చెబుతున్నారని వివరించారు. మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకునే లోపే, అంతా జరిగిపోయిందని డాక్టర్లు చెప్పారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు తాను విచారణకు వచ్చానన్నారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందని, విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని తనను ఆదేశించిందని తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని వ్యాఖ్యానించారు. ఈ సంఘటనపై బాధిత కుటుంబ సభ్యులను కూడా విచారిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

27న మెగా రక్తదాన శిబిరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీ శంకరరావు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, సంయుక్త కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న శుక్రవారం కాఫీ హౌస్ మెయిన్ రోడ్డు పాడేరులో మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గౌరీ శంకర్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఏరియా హాస్పిటల్ ఉన్న బ్లడ్ బ్యాంకులో పూర్తిగా రక్త నిల్వలు అందుబాటులో లేని కారణంగా ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా నిర్వహిస్తు న్నామని, యువతి యువకులు స్వచ్ఛంద సేవా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ శాఖ, వైద్య శాఖ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించి సహకరించాలని ఆయన కోరారు.